

# ఓ కుక్కగారి కథ

- ఎస్. వివేకానంద

జంటనగరాల్లో వీధివీధినా కుక్కల సందడే! అదుపు ఆజ్ఞ లేకుండా తిరిగేస్తుంటయ్! రౌడీ షీటర్స్‌ని, దొంగ రాస్కెల్స్‌ను వేటాడి పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు డ్యూటీలు నిర్వహిస్తున్నారేమోని అంతా భ్రమపడ్డారు. ఇల్లిల్లూ గాలించటం చూచినవారు విస్తుపోయారు. ఈ హడావుడి అంతా ఏమిటబ్బాని విచారిస్తే... పెద్ద దొరగారి పెట్ డాగ్ తప్పిపోయిందనే నిజం బైటకి పొక్కింది. తప్పిపోయింది సీదా సాదా కుక్కకాదు. పిచ్చి కుక్కో, వీధి కుక్కో అసలే కాదు. గజ్జి కుక్క అంత కంటే కాదు. డాలర్స్ పోసి విదేశంలో కొని ప్రేమతో వెంట తెచ్చుకున్న... గారాబంగా ముద్దుగా మురిపెంగా పెంచుకుంటున్న మైబ్రీడ్ డాగ్! తొండం లేకపోయినా అది ఏనుగు పిల్లంత ఉంటుంది. జూలు లేకున్నా సింహంలా గర్జించినట్టు ఉంటుంది. ఇన్ని గొప్ప లక్షణాలున్న ఆ డాగ్‌ని ఎవరైనా 'కుక్క' అంటే యజమాని ఫైరై పోతాడు. ఆ కోపాన్ని చల్లార్చటం ఫైరింజన్ తరం కూడా కాదు.

తప్పిపోయిన పెట్ డాగ్‌కి రోజూ రెండు పూటలా ఖరీదైన సబ్బుతో స్నానం చేంచి టర్కీ టవల్‌తో తుడుస్తారు. కునేగా మరి కొళుందు సెంటు పూస్తారు. ఇంపోర్టెట్ బిస్కెట్లు మాత్రమే పెడతారు. రోజుకి ఐదు లీటర్ల పాలు, అర కేజీ మీట్ అవలీలగా రగిస్తుంది. అరడజను బాయిల్డ్ ఎగ్స్ లాగిస్తుంది.

ఎన్నోసార్లు డాగ్ షాల్లో పాల్గొని ఫస్ట్ ప్రైజ్‌ని కైవసం చేసుకున్న ఘనత దానికుంది.

దానికి కళ్లజోడు. ప్రత్యేకంగా కుట్టించిన డ్రెస్ చూపరులను ఆకర్షి స్తుంది.

అటువంటి గొప్ప పెట్ డాగ్ తప్పి పోయినందుకు యజమాని ఇంట్లో సభ్యులకు నిద్రాహారాలు లేకుండా పోయినయ్. తమ ఫామిలీ మెంబర్ మిస్సైపోయినంతగా బాధ పడుతున్నారు.

పెద్ద దొరగారి కుక్క (సారీ! పెట్ డాగ్) తప్పి పోవటం కాదు గాని... పోలీసుల చావుకొచ్చింది (ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చి నట్టు).

తమ రెగ్యులర్ డ్యూటీలు మానేసి రాత్రింబవళ్లు ఒకటే వెతుకులాట! అది దొరక్కపోగా కనీసం దాని ఆచూకీ అయినా తెలుసుకోలేకపోయారు.

అయినా అణువణువూ రాజధాని నగరమంతా గాలిస్తున్నారు.

ఎస్సైగారి డాగ్ అన్నా అయితే పర్లేదు. కానీ ఇది డి.జి.పి. దొరవారిది. 'మిస్సింగ్' కేసు అని ఫైల్ క్లోజ్ చేసుకోవడానికి అస్సలు వీల్లేకుండా పోయింది.

ఫెయిత్‌ఫుల్‌గా దొరగారి కింద పనిచేసేవారి కంటే... తప్పిపోయిన పెట్ డాగ్ అత్యంతవిశ్వాసం గలదాయె! దొరికేవరకూ వెతక్కతప్పదు!

తప్పిపోయిన పెట్ డాగ్‌ని వెతికి పట్టుకోలేకపోతే... ఇంకేమైనా ఉందా?! రివర్షన్లు... ట్రాన్సుర్లు! కింది స్థాయి ఉద్యోగస్తుల పని గోవిందా గోవింద!

పెట్ డాగ్ మిస్సవటం కాదు గాని... అందరి దుంప తెగుతోంది. ఎవరు ఎప్పుడు 'సస్పెన్షన్' వేటుకి గురవుతారో చెప్పలేని పరిస్థితి. ఎవరు 'రివర్ట్' అవుతారో ఊహించలేని విషయం. అంతా అయోమయం... గందరగోళం!

ఎవరి నోట విన్నా మిస్సింగ్ పెట్ డాగ్ గురించే! హాట్ టాపిక్ అయి కూర్చుంది.

పెట్ డాగ్ మిస్సింగ్ విషయం అటు అన్ని టి.వీ. ఛానెల్స్‌లోనూ, దినపత్రికల్లోనూ ఫోటోతో సహా పబ్లిసిటీ భారీగా వచ్చేసింది.

కంటబడిన ప్రతి కుక్కనీ శల్యపరీక్ష చేసి వదిలేస్తున్నారు పోలీసులు. ఈ సంచలన వార్త విని పౌరులంతా దిగ్భ్రాంతికి లోన య్యారు.

పెట్ డాగ్‌ని పట్టి తెచ్చినవారికి ఆకర్షణీయమైన బహుమతితో పాటు వయస్సు, విద్యార్హతలను బట్టి పోలీస్ డిపార్ట్ మెంట్లో ఉద్యోగం అంటూ ప్రకటనలు గుప్పించటం కూడా జరిగింది.

ఇంకేముంది? నిరుద్యోగయువకులందరికీ చేతి నిండా పని. సామాన్యపౌరులు సైతం ప్రైజు మనీ కోసమో, మరో పని లేకనో వెతుకులాట తీవ్రతరం చేశారు.

అన్ని పోలీసు స్టేషన్లకూ 'వైర్ లెస్ మెసేజస్' వెళ్లిపోయినయ్! బస్ స్టాండు, రైల్వేస్టేషన్లాంటి జనసమ్మర్దం గల ప్రదేశాల్లో సైతం ప్రత్యేక నిఘా విభాగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినయ్!

ఎయిర్ పోర్ట్‌లోనూ మఫ్టీలో పోలీసులు పహరా కాస్తున్నారు. కళ్లలో వత్తులేసుకుని వెతుకుతున్నారు.

తప్పిపోయిన మూడు రోజులు గడచినా డాగ్ దొరకలేదు. వెతుకులాట ఆగలేదు.

డి.జీ.పి. దొర అగ్గి మీద గుగ్గిలమైనాడు. నక్సలైట్ నాయకుడైనా తేలిగ్గా దొరకపుచ్చుకోవచ్చేమో గాని ఈ పెట్ డాగ్ మాత్రం కన్పించి చావటం లేదని అందరూ మనసులో తిట్టుకుంటున్నారు.

రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా 'సెర్చ్' సాగుతోంది. రాత్రిళ్లు వీథుల్లో 'ఫ్లడ్ లైట్స్' ఏర్పాటు చేశారు. పగటికీ, రాత్రి వేళకీ తేడా లేకుండాపోతోంది. బోలెడంత 'కరెంట్' ఖర్చుతో పాటు వందలాదిమంది శ్రమ వృథా అవుతోంది.

చివరికి వాడవాడలా వాల్ పోస్టర్లు కూడా ప్రత్యక్షమైనయ్ గోడల మీద! నాలుగు రోడ్ల కూడళ్లలో ఎన్లార్జ్‌డ్ పెట్ డాగ్ బొమ్మతో (సారీ... ఫోటోతో) భారీ కటౌట్లు కూడా దర్శనమిస్తున్నయ్

డాగ్ మిస్సింగ్‌తో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడింది. హోమ్ మినిస్టర్ గారు ఫైరై పోతున్నారు. ముఖ్యమంత్రిగారు చిరాకు పడుతున్నారు. పోనీ ప్రభుత్వం ఖర్చుతో ఆ దేశమేదో వెళ్లి మరొక దాన్ని అదే జాతి డాగ్‌ని కొనితెచ్చుకోవటానికి పైనుండి పర్మిషనొచ్చినా... ససేమిరా వీల్లేదని అదే డాగ్ కావాలంటూ మొండికెత్తారు డి.జి.పి. దొరవారు. తనకు మరో రెండు నెలల మాత్రమే సర్వీసు ఉంది. తాను రిటైరయ్యాక వెతికేవారే కరవౌతారు.

పెట్ డాగ్‌ని కొన్న క్షణం నుంచి దొరవారికి అదృష్టం కలిసొచ్చింది! కొడుకు విదేశాలకు వెళ్లాడు. కూతురి పెళ్లి మంత్రి గారి అబ్బాయితో ఘనంగా జరిగింది. తనకు డి.జి.పి. ప్రమోష నొచ్చింది.

అటువంటి అదృష్టజాతకం ఆ పెట్ డాగ్‌ది! అటువంటి గ్రేట్ పెట్ డాగ్ తప్పి పోయినందుకు డి.జి.పి. గారిలో దిగులెక్కువైంది. అదసలు దొరుకుతుందో లేదో! ఎవరైనా కాజేసుకెళ్లారా? పాయిజన్ చేసి ఐపులేకుండా చేసి ఉండచ్చొ? ఏదీ అర్థం కాకుండా ఉంది.

డాగ్ మిస్సింగ్‌తో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడింది. హోమ్ మినిస్టర్ గారు ఫైరై పోతున్నారు. ముఖ్యమంత్రిగారు చిరాకు పడుతున్నారు. పోనీ ప్రభుత్వం ఖర్చుతో ఆ దేశమేదో వెళ్లి మరొక దాన్ని అదే జాతి డాగ్‌ని కొనితెచ్చుకోవటానికి పైనుండి పర్మిషనొచ్చినా... ససేమిరా వీల్లేదని అదే డాగ్ కావాలంటూ మొండికెత్తారు డి.జి.పి. దొరవారు.

తనకు మరో రెండు నెలల మాత్రమే సర్వీసు ఉంది. తాను రిటైరయ్యాక వెతికేవారే కరవౌతారు. తన మాటకి విలువుండదు. తన ఆర్డర్స్‌ని ఎవ్వరూ లక్ష్యపెట్టరు. అమ్మో! ఊహించుకుంటూంటేనే వొళ్లు జలదరిస్తోంది.

రిటైర్మెంట్ లోగా తన పెట్ డాగ్ దొరికి తీరాల్సిందే! దేరీజ్ నో అదర్ ఆల్టర్‌నేటువ్! భీష్మించుకున్నారు దొరవారు.

కింది స్థాయి సిబ్బందిలో కలవరం మొదలైంది. డాగ్ దొరక్కపోతే చాలామందికి పిచ్చెక్కేట్టుంది. జుట్టు పీక్కుంటున్నారు. తలలు గోడకేసి బాదుకుంటున్నారు.

రోజులు గడిచే కొద్దీ సమస్య మరింత జటిలమైంది. డాగ్ దొరికేట్టు చేయి తండ్రీ అంటూ అందరు దేవుళ్లకూ మొక్కు తున్నారు.

కొండకెల్లి గుండు గీయించుకుంటున్నారు. గుడి చుట్టూ... తడిగుడ్డల్తో పొర్లు దణ్ణాలు పెడుతున్నారు. హుండీలో కానుక లేస్తున్నారు (దొడ్డి దోవన సంపాదించిందే)!

నైట్ డ్యూటీలు చేస్తున్న పోలీసులు అలిసిపోయి చాయ్ పానీ తాగుదామని ఇరానీ హోటల్లో కెళ్లారు.

**000**

డి..జి.పి. దొరవారి కార్యాలయం కళ తప్పి వెలవెలబోతోంది. దొరవారు దిగులుతో ఆఫీసుకు రావటమే లేదు. సంతకాల కోసం ఫైళ్లు ఇంటికి మోసుకెళ్తున్నారు లఘుస్థాయి ఉద్యోగులు.

పైనుండి కింది వరకు అందరి 'వర్రీ' ఒకటే! డి.జి.పి. గారు అందరి మీదా చిర్రుబుర్రులాడుతున్నారు. తిడుతున్నారు. ఫైళ్లు విసిరి మొహాన కొడుతున్నారు.

ఇంతలో ఎక్కడి నుంచో 'వైర్ లెస్ మెసేజ్' రావటంతో ఐ.జీ. గారు డి.జి.పి దొరవారి ఇంటికి కార్లో పరుగుపెట్టారు.

ఆయన వెనకగా మందీమార్బలం జీపులు కదిలాయి. పోలీస్ డిపార్ట్‌మెంట్ వెహికిల్స్ 'కాన్వాయ్' తీరు చూచి నగరవాసులు అచ్చెరువందేరు.

'సార్... మెసేజ్ వచ్చింది...' వస్తూనే బంగళా గుమ్మం దగ్గర నిలబడి అలజడితో అటూఇటూ పచార్లు చేస్తున్న డి.జీ.పి. దొరవారిని చూచి అన్నాడు ఐ.జీ.

'ఆఁ! నిజంగా! ఏమిటా మెసేజ్? నా పెట్ దొరికిందా? ఎక్కడుంది? ఎవరు లాక్కెళ్లారు దాన్ని? ఐవాంట్ ఆల్ ది డీటెయిల్స్...' బి.పి. తెచ్చుకుని మరీ ప్రశ్నల వర్షం కురిపించాడు.

పక్కనున్న అధికారవర్గం ఆ మెసేజ్ ఏమిటై ఉంటుందనా చెవులు రిక్కించి మరీ వింటున్నారు.

"చెప్పవయ్యా ఐ.జీ! ఆ మెసేజ్ నా పెట్ డాగ్ గురించేనా? లేక టెర్రరిస్ట్ లెవరైనా జంట నగరాల్లో చొరబడ్డారనా?' అసహనం వ్యక్తపరచాడు డి.జీ.పి.

'ప్లీజ్! కూల్ డౌన్ సార్. మీరు లోపలికి నడవండి! సోఫాలో కూర్చోండి. అన్ని వివరాలూ చెప్తాను.'

ముందు డి.జి.పి., వెనగ్గా ఐ.జీ బంగళాలోకి దారి తీశారు. మిగతా అధికారులంతా గుమ్మం వద్దే వినయవిధేయలతో చేతులు కట్టుకుని, లాఠీలు చంకలో పెట్టుకుని నిలబడిపోయారు.

'ఆఁ! ఇప్పుడు చెప్పండి. మీరు చెప్పబోయేది నా పెట్ గురించే కదూ? అది దొరికింది అనే శుభవార్తే కదూ? ఇక భరించే స్థితిలో లేను.

త్వరగా చెప్పండి...' ఆయనగారిలో ఆదుర్దా పెరుగుతోంది. విషయం తెలుసుకోవాలంటే ఉత్కంఠ మరో వేపు కుదిపేస్తోంది.

"అదే సార్, మన కుక్క..." అంటూ చెప్పబోయి 'కుక్క' అన్నందుకు నాలుక్కరుచుకున్నాడు ఐ.జీ.

'వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్? నా పెట్ డాగ్‌ని... ఇంపోర్టెడ్ కాస్ట్లీ పెట్‌ని మున్సిపాలిటీ వాళ్లు కుక్కల బండిలో ఎక్కించుకెళ్లారా? దాన్ని చంపేశారా? ఇంకా అది ప్రాణాలతో బతికివుందా?' ఉగ్రుడైనాడు డి.జీ.పి. గారు. 'బ్రతికేవుంది సార్. ప్రచారసాధనాల ద్వారా ఇచ్చిన పబ్లిసిటీ చూచిన హెల్త్ ఇన్స్పెక్టర్ మీ పెట్‌ని పేపర్లో వచ్చిన ఫోటోతో పోల్చుకుని మనకు మెసేజ్ పంపారు సార్...' ఐజీ నింటారుగా నిలబడి మరీ చెప్పాడు.


'ఇన్నాళ్లుగా పడిన శ్రమ ఊరికేపోలేదు సార్! స్టాఫ్ అంతా శ్రమించారు. దాని ఫలితమే ఇది!..." ఇంకా ఏదో చెప్ప బోయిన ఐ.జీ మాటకి అడ్డొస్తూ, 'అబ్బా!... సోది ఆపి మేటర్ చెప్పవయ్యా' విసుక్కున్నారు డి.జి.పి. దొరవారు

కూర్చున్నవాడల్లా లేచి, అటెన్షన్ పోజులో నిలబడి 'అదే సార్ నే చెప్పొచ్చింది! మీ పెట్ డాగ్ అని తెలీక పోవడంతో, దాని మెడలో 'బెల్ట్' కూడా ఉండి ఉండకపోవటంతో, మున్సిపల్ కార్పొరేషన్ డాగ్ స్క్వాడ్ వాళ్లు దాన్ని స్ట్రీట్ డాగ్‌గా భావించి, కుక్కల బండిలో వేసుకెళ్లారట సార్...'

'వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్? నా పెట్ డాగ్‌ని... ఇంపోర్టెడ్ కాస్ట్లీ పెట్‌ని మున్సిపాలిటీ వాళ్లు కుక్కల బండిలో ఎక్కించుకెళ్లారా? దాన్ని చంపేశారా? ఇంకా అది ప్రాణాలతో బతికివుందా?' ఉగ్రుడైనాడు డి.జి.పి. గారు.

'బ్రతికేవుంది సార్. ప్రచారసాధనాల ద్వారా ఇచ్చిన పబ్లిసిటీ చూచిన హెల్త్ ఇన్స్పెక్టర్ మీ పెట్‌ని పేపర్లో వచ్చిన ఫోటోతో పోల్చుకుని మనకు మెసేజ్ పంపారు సార్...' ఐజీ నింటారుగా నిలబడి మరీ చెప్పాడు.

'చావు కబురు చల్లగా చెప్పావు గదయ్యా! నువ్వీ పాటికి నా పెట్‌ని తప్పించి వెంట తీసుకురావలసింది. పిచ్చి ముండ... బిస్కెట్లు తిని ఎన్నాళ్లయిందో? మినరల్ వాటర్ తప్ప అది తాగి ఎరగదు అట్లాంటిది. కంపుకొట్టే వీధి కుక్కల బండిలోనే అది ఇన్నాళ్లూ ఉన్నదా? స్టేటస్ ఎంత దిగజారిపోయిందయ్యా? కమాన్ గో... ఇమీడియట్‌గా నువ్వు స్వయంగా వెళ్లి దాన్ని విడిపించి వెంట పెట్టుకురా! నా పెట్‌ని నేను కళ్లతో చూచేవరకు నాలోని ఆందోళన తగ్గదు...!' హుకుం జారీ చేశాడు. డి.జి.పి.గారు.



గిర్రన వెను దిరిగిన ఐ.జీ. బైటికొచ్చి కారెక్కాడు.

మిగతావారంతా ఐ.జీ. వెహికల్‌ని ఫాలో అయ్యారు.

అర్ధగంట కాకముందే 'డాగ్'ని కార్లో ఎక్కించుకొచ్చి దొరవారికి అప్పగించిన ఐ.జీ.ని ప్రశంసలతో ముంచెత్తాడు.

పెట్ డాగ్‌ని చాలా రోజుల తర్వాత చూడగల అవకాశం దొరకటంతో డి.జి.పి. దొరవారి నయనాలు అశ్రుపూరితాలైనయ్. బంగళాలో ఫామిలీ మెంబర్స్‌ంతా సంబరంతో ఎగిరి చిందులు తొక్కేరు. ఈ ప్రకారంబుగా కథ సుఖాంతమైనందుకు అక్కడివారే కాదు ఎక్కడికక్కడి వారూ, తృప్తిగా గాలి పీల్చుకుని ఆనందించారు.

(పోలీసువారికి క్షమాపణలతో కేవలం వినోదం కోసమై వ్రాసిన కథే ఇదీ!)